


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

శుక్రవారం | 07 నవంబరు 2025 — పేజీలు 8




అయ్యప్పస్వామి దేవాలయం రోడ్డులో గుంతలమయమైన రహదారి



జొహరాపురం నుండి వెంకాయపల్లె వెళ్లే రహదారి

- గుంతలు లేని రోడ్లు కర్నూలులో కనిపించవు
- చెరువును తలపిస్తున్న నందికొట్కూరు రోడ్డు
- బిర్లాగేట్ వద్ద దర్శనమిస్తున్న పెద్దపెద్ద గుంతలు
- గుంతలు పూడ్చేదెన్నడు?
- స్మార్ట్‌సిటీ అంటే ఇదేనా? అంటున్న ప్రజలు

## నగరం రోడ్లు..

# నరకానికి రహదారులు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కర్నూలు నగరంలోని రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. నగరం నరకంగా మారింది. మోకాలి లోతు గుంతలు దర్శనమిస్తున్నాయి. గుంతలు లేని రోడ్లను చూపించడం అసాధ్యం. ఈ సీజన్‌లో వర్షాలు ఎక్కువ కావడంతో చిన్నపాటి వర్షానికి వర్షపు నీటితో నిండిపోతున్న గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. ఎక్కడ గుంత ఉందో తెలియక పాదచారులు, ద్విచక్ర వాహనదారులు భయం భయంగా రోడ్లమీదకు రావలసి వస్తోంది. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గతంగా ఉన్న రోడ్లు సైతం బాగా దెబ్బతిన్నాయి. గుంతలు లేని రోడ్లంటూ రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చేసినా కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో మాత్రం అలాంటి పరిస్థితి కనిపించడం గగనంగానే మారింది.

మిగతా 2లో



ఆర్ఎస్ రోడ్డులో అధ్వాన్నంగా తయారైన రోడ్డు



బిర్లా రోడ్డులో గుంతలమయమైన ప్రధాన రహదారి



కృష్ణానగర్‌లో గుంతలు పడ్డ రోడ్డు



బిర్లా రోడ్డులో గుంతలమయమైన ప్రధాన రహదారి



కిసాన్ ఘాట్‌కు వెళ్లే రహదారిలో ఏర్పడ్డ గుంతలు

### మెడికల్ కళాశాల వద్ద

## రోడ్డు విస్తరణ

- స్వయంగా తొలగించుకున్న దుకాణాదారులు
- హైకోర్టు తీర్పు నేపథ్యం
- మంత్రి భరత్ చొరవతో పరిష్కారమైన సమస్య

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** నగరంలోని మెడికల్ కళాశాల ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రధాన రహదారి అయినా మెడికల్ కళాశాల

మిగతా 2లో



రోడ్డు విస్తరణకు సహకరిస్తున్న దుకాణాదారులు

## రైతుల పై దళారీల దాడి



బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతున్న విహెచ్‌పి, భజరంగదళ్ నాయకులు

- ఆందోళన వ్యక్తం చేసిన విహెచ్‌పి, బజరంగ్‌దళ్
- మరోమారు జరగకుండా చూడాలంటూ డిఎస్పీకి వినతిపత్రం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కర్నూలు పాతబస్టాండ్‌లోని పూలమార్కెట్‌లో రైతులు పూలుతెచ్చి అమ్ముకోవడం నిషిద్దమంటూ కొందరు వ్యాపారులు

మిగతా 2లో

### టీజీవీ కళాక్షేత్రానికి

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

- అభినందనీయమన్న మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ.వెంకటేష్



2 లో

టీజీ వెంకటేష్‌ను సత్కరిస్తున్న తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ చనుబట్ల వెంకటాచారి

## చిక్కమంచోలి బ్రిడ్జి అనుమతించలేం

- కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి త్రాగు,సాగు నీటి కష్టాలు వస్తాయి
- గుండ్రేవులకు మూడు రాష్ట్రాలు అనుమతించాలి
- రాష్ట్ర పండుగగా రేపు భక్త కనకదాసు జయంతి
- తెదేపా జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి,ఎంపి బస్తిపాటి నాగరాజు

**కర్నూలు, మేజర్‌న్యూస్ బ్యూరో :** తుంగభద్ర నదిపై కర్నాటక ప్రభుత్వం నిర్మిస్తామంటున్న చిక్కమంచోలి బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణాన్ని అంగీకరించలేమని

మిగతా 2లో



మాట్లాడుతున్న ఎంపి నాగరాజు, జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

## పాపం పసిపాప

పసిగుడ్డును అనాథను చేసిన కన్నవాళ్ళు..



2 లో

పసిపాపను పరిశీలిస్తున్న ప్రభుత్వాసుపత్రి సుపరింటెండెంట్ డాక్టర్

సూర్య www.suryaa.com



# నగరం రోడ్లు..నరకానికి రహదారులు

**(మొదటి పేజీ తరువాయి)**

నందికొట్కూరు రహదారి చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తోంది. నందికొట్కూరు రోడ్డు నుండి జోహరాపురం మలుపు తిరిగే చోట మోకాలి లోతు గుంతలు పడి చాలా రోజులే అయినా ఆ గుంతలను పూడ్చే నాథుడు లేక అక్కడి ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. ఇక, బిర్లా గేట్ వద్ద రోడ్డు దెబ్బతిని గుంతలు పడింది. తాత్కాలికంగా చేస్తున్న మరమ్మత్తులు ఫలితాలనివ్వడం లేదు. ఖర్చు వృధా అవుతోంది. ఇక్కడ పదేపదే గుంతలు పడుతున్నా ప్రజలు కింద పడి కాళ్లు చేతులు విరగ్గొట్టుకుంటున్నా శాశ్వతంగా సమస్యను పరిష్కరించేందుకు అధికారులు నడుం బిగించడం లేదు. కృష్ణానగర్‌కు వెళ్లే వైపు రైల్వే అండర్ బ్రిడ్జి కింద చాలా కాలంగా మురుగునీరు రోడ్డెక్కి పారుతున్నా కెఎంసి అధికారుల కళ్లకు అది కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇక్కడ సమస్య ఉంటే మాకు ఫోన్ చేయండి అంటూ ఏర్పాటు చేసిన బోర్డును ఒకే పూటలో తొలగించారు. ఇక్కడకు సమీపంలోనే ఉన్న మరో అండర్ బ్రిడ్జి కింద కూడా చిన్నపాటి వర్షానికి రోడ్డు చెరువుగా దర్శనమిస్తోంది. ఇక్కడి చాలా ఏళ్లుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రధాన రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి కూడా దెబ్బతింది. వీటికి కనీస మరమ్మత్తులు చేయకపోవడంతో రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణీకులతో పాటు వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, రామలింగేశ్వరనగర్, కప్పలనగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కిసాన్‌ఘాట్, మెడికల్ కాలేజీ గర్ల్స్ హాస్టల్, స్విమ్మింగ్ పూల్ మీదుగా బస్టాండ్‌కు వెళ్లే రోడ్డు దారుణంగా దెబ్బతినింది. కలెక్టరేట్ నుండి కొత్తబస్టాండ్‌కు వెళ్లే ప్రజలకు ఇది దగ్గరి దారి కావడంతో ఇటీవల ఈ రోడ్డు మీదుగా ట్రాఫిక్ పెరిగింది. అయినా అధికారులకు ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేయాలన్న ఆలోచన కలగకపోవడం రోడ్ల



నందికోట్కూరు రోడ్డులోని హైవే రోడ్డు

నిర్వహణపై కెఎంసికి ఉన్న శ్రద్ధ ఏ పాటిదో స్పష్టం చేస్తోంది. కేవలం వర్షాల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పుకుంటారేమో వర్షాలు లేని సమయంలోనూ కర్నూలు నగరంలోని రోడ్లు నరకానికి రహదారులేనడంలో ఎలాంటి సందేహం లేదు.

# మెడికల్ కళాశాల వద్ద రోడ్డు విస్తరణ

**(మొదటి పేజీ తరువాయి)**

ముందు మాత్రం రోడ్డు ఇరుకుగా ఉన్న కారణంగా ఎందరో రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. అందులో మెడికల్ కళాశాల విద్యార్థుల సంఖ్యే ఎక్కువగా ఉంది. దీంతో ఇక్కడ ఒక ప్రార్థనా మందిరం ముందున్న దుకాణాలను తొలగించి రోడ్డు విస్తరణ చేయాలని ఆందోళనలు కూడా జరిగాయి. మెడికోలు చాలా సార్లు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. రాజ్‌విహార్ (స్వామి వివేకానంద సర్కిల్) నుండి గాయత్రీ ఎస్టేట్ వరకు దశాబ్దం క్రితం రోడ్డు విస్తరణ చేసినా మెడికల్ కళాశాల వద్ద దుకాణాలను తొలగించలేదు. నగరంలోని ఈ ప్రధాన రహదారి 100 అడుగుల వెడల్పుండగా, మెడికల్ కళాశాల దగ్గర మాత్రం 30 అడుగుల వెడల్పు కూడా లేదు. మంత్రి టి.జి.భరత్ ఈ రోడ్డు విస్తరణపై ప్రత్యేక



శ్రద్ధ చూపించిన ఫలితంగా దుకాణాల తొలగింపు గురువారం ప్రారంభమైంది. దుకాణాలను తొలగిస్తున్న కారణంగా నష్టపోతున్న వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా కెఎంసికి చెందిన దుకాణాలను కేటాయించేలా భరత్ చర్యలు తీసుకున్నా కొందరు హైకోర్టుకు వెళ్లారు. రోడ్డు విస్తరణకు హైకోర్టు ఆదేశాలివ్వడంతో బుధవారం మునిసిపల్ అధికారులు దుకాణాలు తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. శాంతి భద్రతలకు భంగం కలుగకుండా చూసేందుకు అవసరమైన పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేసుకున్నారు. అయితే దుకాణాదారులు స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించుకుంటామని తెలియజేయడంతో ఆ పని వాయిదా పడింది. గురువారం ఉదయం నుండి దుకాణాదారులే స్వయంగా వాటిని కూల్చివేసే పని ప్రారంభించడంతో ఇంత కాలం ఈ ఇరుకైన రహదారితో ఇబ్బంది పడ్డ ప్రజలు ఇక తమ కష్టాలు తీరబోతున్నాయంటూ హర్షం వ్యక్తం చేశారు. మంత్రి టి.జి.భరత్‌కు ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# చిక్కమంచోలి బ్రిడ్జి అనుమతించలేం

**(మొదటి పేజీ తరువాయి)**

తెలుగుదేశం పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు స్పష్టం చేశారు. గురువారం తెదేపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణంతో తమకు రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందని, బ్యారేజీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించుకోవచ్చని కర్నాటక చెబుతున్నా అక్కడ నిలిపే నీటిని ఎత్తిపోతల పథకాలతో ఆ ప్రభుత్వమే తరలించుకుపోతుందని, ఇది గతానుభవమేనని వారు చెప్పారు. కర్నాటక ప్రభుత్వం బ్యారేజీ సామర్థ్యం కేవలం 0.35 టిఎంసిలేనని చెబుతున్నా ఆంధ్ర ఇంజనీర్లు దాన్ని సామర్థ్యం 3 టిఎంసిలుంటుందని అంటున్నారని వారు చెప్పారు. వర్షాలు సమృద్ధిగా ఉంటే బ్యారేజీ నిర్మాణంతో ఎలాంటి సమస్య ఉండదని, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో కర్నూలు జిల్లా పశ్చిమ భాగానికి చుక్క నీరందని వారు చెప్పారు. అప్పుడు కర్నూలు జిల్లా రాజస్తాన్ ఎడారిలా మారుతుందని వారు వివరించారు. తుంగభద్ర జలాలను వినియోగించుకునేందుకు వీలుగా గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి మూడు రాష్ట్రాలు ముందుకు రావాలని వారు కోరారు.

**రాష్ట్ర పండుగగా రేపు భక్త కనకదాసు జయంతి :** శ్రీకృష్ణుడిని తన కీర్తనలతో అలరించిన భక్త కనకదాసు జయంతి వేడుకలను శనివారం రాష్ట్ర పండుగగా జరుపుతున్నట్లు వారు తెలిపారు. ఉడిపిలో కనకదాసు ఆలయంలోకి రావడాన్ని నిషేధించినప్పుడు ఆలయం వెనక్కు వెళ్లి కీర్తనలు ఆలపించడంతో శ్రీకృష్ణుడు వెనక్కు తిరిగారని,అక్కడ కృష్ణుడు భక్తులకు వెనుకనుండి దర్శనమిస్తున్నారని, అంతటి భక్తుడు కనకదాసు అని వారు తెలిపారు. కర్నూలు జిల్లాలో గ్రామగ్రామాన కనకదాసు జయంతి వేడుకలను నిర్వహించుకోవాలని, తెదేపా శ్రేణులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. కురువలు ఎక్కువగా ఉన్న కర్నూలు జిల్లాలో భక్త కనకదాసు వేడుకలు జరుపుకోవాలని, ఈ సందర్భంగా పలు చోట్ల ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించుకుంటారని వారు చెప్పారు.

# పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

**-మండల తాశీల్దార్ వెంకటలక్ష్మి**

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** పిజిఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలనలో జాప్యం తగదని సత్వరమే పరిష్కరించాలని మండల తాశీల్దార్ వెంకటలక్ష్మి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.గురువారం మండల తాశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మండల తాసిల్దార్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో జాప్యం తగదని సత్వరమే నాణ్యతతో పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గ్రామాలలో ఇంటి నీవేశన స్థలాలకు దరఖాస్తులకు స్వీకరించాలని గ్రామ విఆర్వోలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తాశీల్దార్ వెంకటలక్ష్మి మరియు రెవెన్యూ సిబ్బంది, ఆయా గ్రామాల వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుపై దళారీల దాడి

**(మొదటి పేజీ తరువాయి)**

ఒక రైతును అడ్డుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఒక వర్గానికి చెందిన వ్యాపారులు అన్యులెవరూ అక్కడ పూల వ్యాపారం చేయకూడదంటూ అడ్డుపడుతున్నారన్న వార్తలు ఇటీవల వినిపిస్తుండగా, ఒక రైతును వారు అడ్డుకున్న వీడియోలు సోషియల్ మీడియాలో రెండు రోజులుగా వైరల్ అయ్యాయి. కర్నూలు నగరంలో ఇది చర్చనీయాంశంగా మారింది. దీనిపై విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం వారు ఛలో పూల మార్కెట్ కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. దీంతో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది.పోలీసులు జోక్యం చేసుకుని రైతుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తదనంతరం కర్నూలు డిఎస్పీ బాబుప్రసాద్‌ను కలిసిన విహెచ్‌పి, బజరంగ్‌దళ్ కార్యకర్తలు ద ళారీలపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పూల మార్కెట్‌ను సందర్శించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని, రైతులు అక్కడ వ్యాపారం చేసుకునేలా చూడాలని కోరారు. రైతుల భద్రత కోసం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి ప్రాంత విశేష సంపర్క ప్రముఖ్ తూముకుంట ప్రతాపరెడ్డి, విహెచ్‌పి కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందరాజులు, జిల్లా సహకార్యదర్శి గిరిబాబు, బజరంగ్‌దళ్ కో-కన్వీనర్లు చామిరాజు శివసాయినాథ్, తెలుగు భగీరథ, గుజరాతి సురేష్, హరికృష్ణ, యశ్వంత్, జయప్రకాశ్‌సింగ్, భాస్కర్, అర్జున్, శేఖర్, మధుగౌడ్, అనిల్‌సింగ్, రాంబాబు, బాబురావు, జంపాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## టీజీవీ కళాక్షేత్రానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కలలను, కళాకారులను ప్రోత్సహిస్తూ నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరారుతున్న టీజీవి కళాక్షేత్రానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఈ ఏడాది మూడుసార్లు వరుసగా టీజీవి కళాక్షేత్రానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం విశేషం. దీంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ డాక్టర్ చనుబట్ల వెంకటాచారి టీజీవి కళాక్షేత్రం చైర్మన్ టీజీ వెంకటేష్‌ను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ టీజీవి కళాక్షేత్రం కవులు, రచయితలు, కళాకారులకు ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. ప్రాచీన కలలకు తగ్గిపోతున్న వైభవాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. మహానటుడు ఎన్‌టిఆర్ 101వ జయంతి సందర్భంగా 48గంటల పాటు నిర్విరామంగా ఎన్‌టిఆర్ సినిమా పాటల ప్రదర్శనకు తొలిసారి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కిందన్నారు. అలాగే 80మంది కళాకారులతో ఏకధాటిగా నిర్వహించిన ఏకపాత్రాభినయం పోటీలతో రెండోసారి, ఆంధ్ర రాష్ట్ర అవతరణ సందర్భంగా వారం రోజుల పాటు ప్రతిరోజు ఉదయం 10గంటల నుండి రాత్రి 10గంటల వరకు నిర్విరామంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో మూడోసారి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో టీజీవి కళాక్షేత్రంకు చోటు దక్కిందని ఆయన తెలిపారు. ఈ అరుదైన ఘనత సాధించడం వెనుక కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య కృషి ఉందని టీజీ వెంకటేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కోశాధికారి కె రామస్వామి, ఇల్లూరి లక్ష్మయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పాపం పసిపాప

**నందికొట్కూరు, మేజర్ న్యూస్:** అపుడే పుట్టిన ఆడ శిశువును ప్రభుత్వ ఆసుపత్రిలో వదిలి వెళ్లిన అమానవీయ సంఘటన నందికొట్కూరు పట్టణంలోచోటు చేసుకుంది. రోజుల వయసు కూడా లేని ఒక పసిగుడ్డును ఓ గుర్తు తెలియని మహిళ గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని వార్డులోని ఒక మంచం పై ఉంచి వెళ్ళబోయింది. అక్కడే ఉన్నవారు ప్రశ్నిస్తే మంచినీళ్లు తాగి వస్తానని చెప్పి వెళ్లబోయిందని వారు తెలిపారు. అనుమానం వచ్చి వారు ఆసుపత్రిసిబ్బందికి విషయం తెలియజేశారు. ఆసుపత్రి సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ నుపరిశీలించి శిశువును వదిలిపెట్టిన మహిళను గుర్తించారు. దీని ఆధారంగా విచారణ చేపట్టారు.వదిలి వెళ్ళిన మహిళతల్లేనా కాదా అని అనుమానాలు ఉన్నాయి అనంతరం శిశువును స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. శిశువుకు స్థానికంగా వైద్యంఅందించి మెరుగైనవైద్యం కోసంకర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎంతోమందిసంతాన భాగ్యం కోసం ఎదురు చూస్తుంటే కొందరు మాత్రం పుట్టింది ఆడపిల్లని ఆ పసి గుడ్డులను రక్తపు మరకలుఆరకముందే చెత్తకుప్పలు ముళ్ళ కంపల్లో వదిలేసి అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువులు కూడా ఊహతెలియక ముందే లింగ వివక్షకు గురవుతున్నారంటే ఇంతకంటే దారుణం మరొకటి ఉండదు.

## మారందొడ్డిలో విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవం

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** సి.బెలగల్ మండల పరిధిలోని మారందొడ్డి గ్రామంలో గురువారం దేవత మూర్తుల విగ్రహాలను అంగరంగ వైభవంగా ప్రతిష్టిత కార్యక్రమము నిర్వహించారు.గ్రామ రామాలయంలో విగ్రహా ప్రతిష్టితకు కర్నూలు నుండి పురోహితులు ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, పండిత బృంద సభ్యులు ఆలయ విగ్ర ప్రతిష్ఠ కార్యక్రమలను ప్రారంభించారు. మూడు రోజులపాటు నిర్వచించే నాభిశీలల ప్రతిష్ఠ కార్యక్రమములో భాగంగా మొదటిరోజు గణపతి పూజా, పుణ్య వచ్చానం, తదితర కార్యక్రమాలు నిర్వహించి యాగశాల ప్రవేశం అనంతరం విగ్రహాలకు జలవాసం, అగ్ని ప్రతిష్ఠాపన వస్తూపూజా కార్యక్రమాలను విశేష భక్తుల మధ్య నిర్వహించారు.



# రీ సర్వే సద్వినియోగం చేసుకోండి -తహసీల్దార్ సుభద్ర

**దొర్నిపాడు మేజర్ న్యూస్ :** మండలకేంద్రమైన దొర్నిపాడు గ్రామంలో జరిగే రీసర్వే ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుభద్ర రైతులకు సూచించారు గురువారం మండలపరిధిలోని క్రిష్టిపాడు గ్రామ సచివాలయం నందు గ్రామ రైతుల తో సమావేశం నిర్వహించడం జరిగింది ఇసందర్భంగా తహసీల్దార్ సుభద్ర మాట్లా డుతూ దొర్నిపాడు గ్రామ భూములలో క్రిష్టిపాడు గ్రామ రైతులకు సంబందించిన భూములుకూడా కలసి ఉన్నాయని ఆ పొలి మేరలో భూములు కలిగిన రైతులు రీ సర్వే పనుల దగ్గరికి వచ్చి తమ భూమికి


రేషన్ షాప్ తనిఖీ నిర్వహించిన తహసీల్దార్ సుభద్ర

సంబందించిన సరిహద్దులను సరి చూసు కోవాలని ఆమె రైతులకు సూచించారు రీ సర్వే నిర్వహించడం వలన భూసరిహద్దులు సక్రమంగా నిర్ధారించబడటం, భూమి యాజమాన్య వివరాలు పారదర్శకంగా నమోదు చేయడం జరుగుతుంది అని దీని వల్ల భవిష్యత్లోభూవివాదాలు నివారించబడ తాయని ఆమె తెలిపారు అనంతరం గ్రామంలోనిప్రభుత్వ చౌకధరల దుకాణాన్ని తనిఖీ నిర్వహించి రేషన్ పంపిణి విధానాన్ని పరిశీలించారు ప్రభుత్వం రేషన్ కార్డులకు బదులుగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేసిన విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఈ కార్యక్రమం లో తహసీల్దార్ సుభద్ర, డిప్యూటీ తహసీల్దార్ మాధవ్,వి అర్యో లు సాంబశివుడు, నాగేష్, వి ఆర్ ఏ లు చెన్నయ్య, బాషా, లక్ష్మమ్మ కార్యాలయ సిబ్బంది కంభన్న రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగివుండాలి


విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న లీలా వెంకట శేషాద్రి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి లీలా వెంకట శేషాద్రి అన్నారు. గురువారం నగరంలోని బి క్యాంపులోని డిగ్రీ కాలేజ్ ఫర్ మెన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన జాతీయ న్యాయ సేవ దినోత్సవంను పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు కబర్ధి సూచనల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించామ న్నారు. జాతీయ న్యాయ సేవ దినోత్సవ ప్రత్యేకత, సైబర్ చట్టాలు, ఉచిత న్యాయ సేవల గురించి విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. అనంతరం కాలేజీలో వివిధ న్యాయ సేవల పథకాల గురించి నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం ఇందిరాశాంతి, వైస్ ప్రిన్సిపల్ హేమంత్, లీగల్ సర్వీసెస్ మెంబర్ డా.రాయపాటి శ్రీనివాసులు, అధ్యాపకులు డా. ఫక్రునిషా బేగం, డా. వింధ్యవాసిని దేవి, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు కోడుమూరు నియోజకవర్గంలో కోటి సంతకాల 'ప్రజా ఉద్యమం' చురుగ్గా కొనసాగుతుంది. వైసిపి ఎస్ఈసి సభ్యులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ముడుమల గుర్తిలో గ్రామంలో వైసిపి ఇంచార్జ్ డా. ఆదిమూలపు సతీష్ రచ్చబండ-కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్య, ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో వైసిపి ప్రభుత్వ హయాంలో 17వైద్య కళాశాలలను మంజూరు చేస్తే ఇప్పుడు వాటిని పిపిపి విధానంలో ప్రైవేటీకరణకు కట్టబెట్టే కుట్రలను కూటమి ప్రభుత్వం చేయడం దుర్మార్గమన్నారు. అందులో భాగంగా గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు 45రోజుల పాటు కోటి సంతకాల సేకరణ చేపడుతున్నామన్నారు.


సంతకాలు సేకరిస్తున్న ఆదిమూలపు సతీష్, నాయకులు

ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రమేష్ నాయుడు, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, వైసిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, సోమేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కోడుమూరు టీచర్స్ విభాగం అధ్యక్షులు సురేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, గొల్ల మనోహర్, కోట్ల దేవన్న, గొల్ల నడప మద్దిలేటి, పొలదాస్ మద్దిలేటి, బోయ ఈశ్వరప్ప, కురువయ్య స్వాములు పాల్గొన్నారు.

# 15న స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

**-జాబ్ మేళా పోస్టర్ను ఆవిష్కరించిన తెదేపా నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, భార్గవ్ రామ్ లు**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. స్థానిక కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో 10 కంపెనీలతో 800 ఉద్యోగాల కోసం ఉద్యోగమేల నిర్వహిం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

చనున్నారు. ఇందుకు సంబంధించి గురువారం ఆళ్లగడ్డ తాలూకా టిడిపి సీనియర్ నాయకులు భార్గవ్ రామ్, తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ తాలూకాలోని నిరుద్యోగ యువతీ యువకులు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రమాదాల నివారణకై ఆర్‌టిసి డ్రైవర్లు కృషి చేయాలి

**డోన్ అర్బన్ సిఐ ఇంతియాజ్‌భాషా**
**డోన్, మేజర్‌న్యూస్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆద్వర్యంలో గురువారం డోన్ ఆర్‌టిసి డిపో నందు డోన్ అర్బన్ సిఐ ఇంతియాజ్‌భాషా డోన్ డిపో ఆర్టిసి డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డోన్ డిపో మేనేజర్ యం.శశిభూషణ్ ఆధ్వర్యంలో డోన్ అర్బన్ సిఐ ఇంతియాజ్‌భాష ముఖ్య అతిధిగా ప్రమాద రహిత డ్రైవింగ్-ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్టిసి డ్రైవర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సిఐ ఇంతియాజ్‌భాష మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రతి డ్రైవర్ రోడ్ల భద్రతా సూచనలు పాటించాలని, డ్రైవింగ్ చేసే సమయంలో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రజలను వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఈ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకొని డ్రైవింగ్ నందు ఎటువంటి అవాంఛనీయ



ఆర్టిసి డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐ ఇంతియాజ్‌భాష

సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి డ్రైవర్లు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# సంతకాల సేకరణతో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం

**ఏపిఐఐసి మాజీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల చేత సేకరించిన సంతకాలతో బుద్ధిచెబు దామని ఏపిఐఐసి మాజీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. గురువారం ప్యాపిలి గ్రామ పంచాయితీ పరిధిలో ప్రజలతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో


ప్రజల నుండి సంతకాలు సేకరించిన వైకాపా నాయకులు

భాగంగా సంతకాలను సేకరించారు. ప్రజలు సైతం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కూటమి చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సంతకాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రాము, గండికోట చిన్న రామాంజి, ఎంపిటిసి రంగన్న, రంగనాయకులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నిరంగాలలో స్త్రీ శక్తి ప్రతిభ



జయంతిలక్ష్మి, మనోరమలను సన్మానించిన ఆచారిణీలు

**పూర్వ ఆచారిణీలు జయంతిలక్ష్మి, మనోరమ**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ప్రస్తుత సమాజం లో పురుషులకు ధీటుగా మహిళలు వారి స్త్రీ శక్తిని ప్రదర్శించి ప్రతిభను కనబ రచడం గర్వించతగ్గ విషయమని శ్రీ సరస్వతి శిశుమందిర్ పూర్వ ఆచారిణీలు జయంతిలక్ష్మి, మనోరమలు అన్నారు. గురువారం స్థానిక శ్రీసరస్వతి శిశు మందిర్ హైస్కూల్ నందు సప్త శక్తి సంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాతృమూర్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా కృష్ణారెడ్డి, డాక్టర సి.ఎల్లప్ప, మనోరమ, కె.కళ్యాణిలు పూజ చేసి, ప్రార్ధన చేశారు. అనంతరం పూర్వ ఆచారిణీలు జయంతిలక్ష్మి, మనోరమలు స్త్రీశక్తి గురించి మహిళలకు వివరించారు. అనంతరం జయంతిలక్ష్మి, మనోరమ, కళ్యాణిలను ఘనంగా సన్మానించారు. చివరగా శాంతి మంత్రాని పఠించి కార్యక్రమాన్ని ముగించారు.

# అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కల్లూరు అర్బన్ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. 19వ వార్డు జొహరాపురం రోడ్డు మధర్ ల్యాండ్, రామప్రియ నగర్ మెయిన్ రోడ్డు నూతన బిటీ రోడ్డుకు రూ.1కోటి, వెంకటాద్రి నగర్‌లో సిసిరోడ్డుకు రూ.9,98,00


అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు

0లు, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీపార్కు అభివృద్ధి చేయుటకు రూ.9,98,000ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, 19వ వార్డు ఇంచార్జ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వార్డు నాయకులు చాంద్ బాషా, రమేష్ యాదవ్, సుబ్బు, కరీష్, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వాలి


క్రీడాకారులకు దృవపత్రాలు అందచేసిన పాఠశాల యాజమాన్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ప్రతి విద్యార్థి చదువుతో పాటు శారీరక దృఢత్వం కలిగి ఉండాలని స్కూల్ ఏజీఎం అన్వర్ బాషా సూచించారు. గురువారం మాధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్ ఆద్వర్యంలో నిర్వహించిన నారాయణ ప్రీమియర్ క్రీడా పోటీలకు ఏజీఎం అన్వర్ బాషా, హైస్కూల్ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మిలు ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు మానసికంగా, శారీరకంగా క్రీడలు ఆడడంతో జీవితాన్ని మెరుగుపరచడంలో ప్రాముఖ్యత ఉంటుందని, అందుకే నారాయణ యాజమాన్యం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా మొమెంటోను, దృవపత్రాలు అందచేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మీకంగా డీఎం అండ్ హెచ్‌వో తనిఖీ

**మహానంది, మేజర్‌న్యూస్ :**

మహానంది మండలంలోని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నంద్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం ఆయన ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని పేర్కొన్నారు. కస్తూరిబా పాఠశాల విద్యార్థులు ఆసుపత్రికి రావడంతో హాస్టల్ వసతి, స్థితిగతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం అందిస్తున్న భోజనం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి వైద్య సేవలు అందించాలని సూచించారు. వీరి వెంట డాక్టర్ భగవాన్ దాస్, డాక్టర్ వేణు కార్తికేయ, ఎన్‌పీహెచ్ ఈవో హుసేన్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ అమీనాబీ, తదితరులు పాల్గొన్నిరు.

సూర్య www.suryaa.com
శుక్రవారం | 07 నవంబరు 2025

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి

**గోనెగండ్ల,మేజర్‌న్యూస్ :** ఇటీవల పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి కావున సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి కోరారు. గుర వారం గోనెగండ్లలోని పోలీస్ స్టేషన్ లో వార్షికతనిఖీ నిర్వహించారు. అందులో బాగంగా రికార్డులను పరిశీలించారు. గ్రామాలలో నేరాలు తగ్గుముఖం పట్టాయా లేదా అని స్థానిక సీఐ విజయభాస్కర్ ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఏ ఏ గ్రామాలు ఏలా ఉన్నాయని ఆరా తీశారు. అనంతరం పోలీస్ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ భార్గవి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే స్కూల్, కళాశాల పిల్లలకు అధికలోడ్‌తో ఉన్న ఆటోలలో ప్రయాణం చేయ రాదన్నారు. పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని కోరారు. మైనర్ పిల్లలకు వాహనాలు నడపమని ఇవ్వరాదని దాని ద్వార ప్రమాదాలు జరిగితే కుటుంబాలు వీదిన పడాల్సి వస్తుందని ఇందుకు పిల్లల తల్లిదండ్రులదే బాధ్యత అని వారిని పై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పిఎం విశ్వకర్మ యోజనను వినియోగించుకోవాలి


లబ్ధిదారులకు కిట్లను అందచేస్తున్న బిజెపి నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** పిఎం విశ్వకర్మ యోజనను ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని బిజెపి నాయకులు వేల్పుల గోపాల్ అన్నారు. కోడుమూరులోని బాలాజీనగర్‌లోని బిజెపి కార్యాలయంలో గురువారం కోడుమూరు మండల అధ్యక్షులు బెస్త ఈరన్న ఆద్వర్యంలో 38, 39వ వార్డుల లోని విశ్వకర్మ యోజన పథకం లబ్దిదారులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోడీ అందిస్తున్న పిఎం విశ్వకర్మయోజన పథకంను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మెరుగుపడాలన్నారు. అలాగే భారత ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ఎంతో దోహదపడుతుందని మనకు వచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలని అన్నారు. కిట్ల పంపిణీ కార్యక్రమంలో లబ్దిదారులు ఓబిసి మోర్చ విజయ్, ఎబివిపి పాండు రాఘవయ్య ఆచారి, కె శివ, బి రఘునాథ్ సింగ్, వి మనోజ్‌లు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే


చెక్కులు అందజేస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులను గురువారం బాధితులకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చెక్కులను పంపిణీ చేశారు. ఆమె తన కార్యాలయంలో 79 మంది బాధిత కుటుంబాలకు 54,14,611/- వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మండల కేంద్రమైన సిరివెళ్ళకు చెందిన టిడిపి కార్యకర్త అత్తర్ అస్లాం కొద్దిరోజుల క్రితం నంద్యాలలో మోటర్ సైకిల్ ప్రమాదంలో మృతి చెందారు. మృతుడు టిడిపి సభ్యత్వ నమోదు చేసి ఉండడంతో పార్టీ తరఫున ప్రమాద భీమా ఐదు లక్షల రూపాయల మొత్తాన్ని ఎమ్మెల్యే చెక్ రూపంలో మంజూరు చేశారు. ఆ చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అందజేశారు. మృతుడి కుటుంబం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## దివ్యాంగులకు ఉచిత త్రీవీలర్ మోటార్ సైకిళ్ల దరఖాస్తుల ఆహ్వానం



**పాములపాడు మేజర్ న్యూస్ :** మండలంలోని అర్హత కలిగిన వికలాంగులు,వృద్ధులు దివ్యాంగులకు ఉచిత త్రీవీలర్ మోటార్ సైకిళ్లు దరఖాస్తుల చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు రాష్ట్ర ప్రభుత్వం 18 నుండి 45 సంవత్సరాల మధ్య వయసు అర్హులైన దివ్యాంగులకు త్రీవీలర్ మోటార్ సైకిళ్లు ప్రభుత్వం అందజేయనుందని చెప్పారు. అర్హులు నవంబర్ 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.apdascac.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# నగరపాలక కార్యదర్శిగా నాగరాజు

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :**

నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి నాగరాజును రాష్ట్ర ప్రభుత్వం సంస్థ కార్యదర్శిగా నియమించింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ జీఓ నెం. 1225ను జారీ చేశారు. అందులో భాగంగా కర్నూలు పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి నాగరాజుకు పదోన్నతి కల్పించి కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

**-అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే బీవీ**


ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్ మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డిఅన్నారు. గురువారం స్థానిక కుర్నికల్యాణ మండపంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఆయా వార్డులకుసంబంధించిన ప్రజలతో అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వచ్చే సమస్యలన్నీ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వంలో మంచి ప్రభుత్వం అని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మాచాని మహేష్, పట్టణ కమిటీ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు, వార్డుల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచితంగా అందాల్సిన వైద్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు

**టిడిపి పట్టణ అధ్యక్షులు టిఈ.రాఘవేంద్రగౌడ్**


వైద్యం కోసం వచ్చిన వ్యక్తితో మాట్లాడుతున్న టిఈ.రాఘవేంద్రగౌడ్

**డోన్, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ ఆసుపత్రుల లో ఉచితంగా ప్రజలకు అందాల్సిన వైద్యాన్ని కొన్ని డోన్ ప్రైవేట్ ఆసుపత్రుల మధ్యవర్తులు ప్రజలను భయాదోళనకు గురిచేసి, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళేలా పక్కదారి పట్టిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు టిఈ.రాఘవేంద్రగౌడ్ హెచ్చరించారు. డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన దృష్టికి వచ్చిన విషయమై డోన్ ప్రభుత్వ ఆసుపత్రి నందు ఉచితంగా అందవలసిన వైద్యాన్ని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు సంబందించిన పిఆర్‌ఓలు ప్రభుత్వ ఆసుపత్రి నందు వేచి ఉండి తమ ఆసుపత్రులకు పంపించి ఉచిత వైద్యం కోసం వచ్చిన వారికి అధిక రుణభారం వేస్తున్నారని తెలియడంతో గురువారం తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు టిఈ.రాఘవేంద్రగౌడ్ డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి అక్కడికి వైద్యం కోసం వచ్చిన వారిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడుతూ కొన్ని రకాల వైద్యసేవలు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అందుకోవాలని, అత్యవసర వైద్య సేవలకు వైద్యులను సంప్రదించి వారి సూచనలను పాటించాలన్నారు.

# శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్‌లో ఘనంగా " గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** పట్టణంలోని శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్‌లో"గ్రాండ్ పేరెంట్స్‌డే వేడుకలు ఆనందభరితంగా, ఆప్యాయతతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ సుధాకర్ సతీమణి రమ్యారెడ్డి మరియు ప్రిన్సిపాల్‌హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ తాతయ్యలు, అమ్మమ్మల పట్ల ప్రేమను వ్యక్తం చేస్తూ అద్భుతమైన స్పీచ్‌లు, స్కిట్లు, డాన్సులు, మైమ్ ప్రదర్శనలు చేశారు. ప్రత్యేక ఆకర్షణగా తాతయ్యలు, అమ్మమ్మలు తమ మనవళ్లు, మనవరాళ్లతో కలిసి చేసిన " ర్యాంప్ వాక్ అందరినీ ఆకట్టుకుంది. పిల్లలు ప్రేమతో తమ తాతయ్యలు, అమ్మమ్మల పాదాలను కడిగి ఆశీర్వాదం పొందిన పాదపూజ ఎంతో హృద్యంగా సాగింది. అలాగే కార్యక్రమంలో తాతయ్యలు అమ్మమ్మల కోసం ప్రత్యేకంగా ఆటలు కూడా నిర్వహించారు. వారు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వేదికను నవ్వులతో నింపారు. పిల్లలు తమ తాతయ్యలు అమ్మమ్మలపై ప్రేమతో ప్రసంగించగా, పెద్దవారు కూడా తమ మనవళ్ళపై మమకారం, గర్వం వ్యక్తం చేశారు. స్కూల్‌చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ "తాతయ్యలు అమ్మమ్మలు మన కుటుంబానికి మూలస్తంభాలు. వారి విలువలు, ప్రేమ, అనుభవాలు పిల్లల జీవితానికి పునాది కావాలి" అని అన్నారు. హైలైట్‌గా తాతయ్యలు అమ్మమ్మల కపుల్ డాన్స్ అందరినీ ఉత్సాహపరిచింది. వారి ఆప్యాయత, స్నేహం వేదికను ఆనందంతో నింపింది. ఈ కార్యక్రమం ముగింపులో, పాఠశాల యాజమాన్యం ప్రతి తాతయ్య, అమ్మమ్మకు వారి మనవళ్లు, మనవరాళ్లతో ఉన్న ఫోటోతో రూపొందించిన హ్యాండ్‌క్రాఫ్ట్ గిఫ్ట్‌లు అందజేశారు. అలాగే ప్రేమ సూచకంగా రిటర్న్ గిఫ్ట్‌లు కూడా ఇచ్చారు, ఇది అందరి హృదయాలను తాకింది. ఈ కార్యక్రమాన్నివిజయవంతం చేసినటీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు అందరికీ ధన్యవాదాలుతెలిపారు. మొత్తానికి, గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు తరతరాల బంధాన్ని మరింత బలపరిచేలా, ప్రేమ, గౌరవం, ఆనందం నిండిన అనుభూతిని అందించాయి.

# నివాసాలకు సౌకర్యంగా ఉన్న ప్రాంతాలలో ఇంటి స్థలాలు పంపిణీ చేయాలి



తహశిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** పట్టణంలోని జగనన్న కాలనీని రద్దు చేసి అర్హులైన వారికి నివాసాలకు సౌకర్యంగా ఉన్న ప్రాంతాలలో ఇంటి స్థలాలను కూటమి ప్రభుత్వం పంపిణీ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి టి.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం తహశిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మండల కార్యదర్శి టి.కృష్ణ మాట్లాడుతూ రాజకీయ జోక్యం లేకుండా ప్రతి వ్యక్తికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, ప్రభుత్వ స్థలాలలో వాగువంకలలో ఎలాంటి అనుమమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను అకిరట్టాలని, దరఖాస్తు చేసిన ప్రతి వ్యక్తికి ఇంటి స్థలం మంజూరు చేయాలని, రూరల్ పరిధిలో మూడు సెంట్లు, అర్బన్ పరిధిలో రెండు సెంట్ల స్థలాలను ప్రభుత్వంమంజూరుచేయాలన్నారు. అదేవిధంగా గృహనిర్మాణాలకు రూ. 5లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నవ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు రామాంజినేయులు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు, సిపిఐ నాయకులు శివ, అనీల్, మహిళనాయకురాలు సౌజన్య, సునీత, శ్రీలక్ష్మి, రాధా, పద్మావతి, రేణుక, సంధ్యకుమారి, కార్మికులు పాల్గొన్నారు.

# అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :**

అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50వేలు నష్ట పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి బి రాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల కార్యదర్శి రాజు మాట్లాడుతూ పత్తి, వరి, సజ్జ తదితర పంటలు తుఫాను వల్ల తీవ్రంగా నష్టపోయాయని రైతులను ఆదుకోవాలన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. అలాగే ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ నెల 18, 19వ తేదీల్లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు వర్కూరు రాముడు, రైతులు పాల్గొన్నారు.

# హొళగుందలో కన్నుల పండువగా పెద్దగౌరమ్మ పండుగ

★ చెక్కర హారతి పట్టిన మహిళలు..కిక్కరించిన దేవాలయాలు



పెద్ద గౌరమ్మ ప్రతిమ,



హారతిలతో మహిళల సందడి

**హొళగుంద,మేజర్‌న్యూస్‌:** కార్తీక పౌర్ణమిని పుర ష్కరించుకుని మహిళల పెద్దగౌరమ్మ పండుగ గురవారం హొళగుంద మండలంలో కన్నుల పండువగా జరుపుకున్నారు.పెద్దగౌరమ్మ ప్రతిమను స్థానికంలోని పేట వీధిలోని బసవేశ్వరస్వామి,కోటా వీధిలోని భోగేశ్వరస్వామి వివిధ వీధులలో దేవాలయాల్లో పెద్ద గౌరమ్మ ప్రతిమను ప్రతిష్టాపించి తీపి పిండిపదర్థాలను నైవేదంగా సమర్పించారు.దేవతను మోక్కులుతీర్చుకున్నారు. సాయంత్రం చెక్కర హారతిలతో హారతి పళ్లేలో పెట్టుకుని దేవాలయాలో దీపాలను వేలగించారు.పెద్ద గౌరమ్మకు దీపాలతో హారతిని పట్టారు. చిచ్చుబుడిలు,తంతి బానాలు కాల్చారు.పిల్లలు ఉల్లాసంగా బాణాసంచాను పెద్ద ఎత్తున కాల్చారు.ముఖ్యంగా మహిళలకు సంబధించిన పండుగ కావడంతో హొళగుందతో పాటు చుట్టు పక్కన గ్రామీణా ప్రాంతాలలో పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు.దేవాలయాలల్లో భక్తుల సందడి నెలకొంది.గ్రామీనా ప్రాంతాలలో పండుగ వాతవరణం నెలకొంది.

# హాస్టల్ వార్డెన్ భద్రత లోపమే విద్యార్థిని ఆత్మహత్యాత్నానికి కారణం

**– డీవీఎంసీ మెంబర్స్**

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** మోడల్ స్కూల్ హాస్టల్ వార్డెన్ భద్రత లోపమే విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారణమైందని, హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డీవీఎంసీ మెంబర్స్ లింగాల నాగరాజు, రవికాంత్, కాశన్నలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను వారు సందర్శించి సెకెండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు ఏమిటని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత విద్యార్థినీల పట్ల అభద్రత లోపం వల్లననే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని అసలు ఆ విద్యార్థినీని వార్డెన్ ఫోన్‌లో ఏమని మందలించిందో ఆ మందలింపు వలన విద్యార్థి మనస్థాపానికిలోనై బయటి నుంచి ఎలుకల మందు తెచ్చుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వారు అన్నారు. దీనికి కారణమైన హాస్టల్ వార్డెన్‌ను విచారించి వెంటనే సస్పెండ్ చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, హాస్టల్ వార్డెన్‌పై ప్రిన్సిపల్, సమగ్ర సర్వ శిక్ష అధికారి, బాలికల



ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న డీవీఎంసీ మెంబర్స్

డెవలప్‌మెంట్ అధికారిలోపం వలననే ఈ చర్య జరిగాయని వారు అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, లోకాయుక్త, మానవ హక్కుల కమీషన్ దృష్టికి తీసుకెళ్తామని వారు అన్నారు.

# రైతులందరికి న్యాయం చేయాలి-ఎంపీపీ వీరభద్రుడు

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** మొంథాతుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులందరికి న్యాయం చేసి నష్టపరిహారం అందజేయాలని మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వీరభద్రుడు ప్రభుత్వాన్ని కోరారు.చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి రామిశెట్టి వీరభద్రుడు అధ్యక్షతన, ఎంపీడీఓ తాహీర్‌హుసేన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల కురిసిన మొంథా తుఫాను ప్రభావంతో ఖరీఫ్‌లో సాగు చేసి దెబ్బతిన్న పంటలకు కేవలం ఖరీప్‌కు మాత్రమే ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తామనడం సమంజసం కాదని,రబీ లో పంటలు సాగు చేసి తుపాన్‌కు నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు,సిబ్బంది వారి వారి శాఖల పురోగతిని చదివి వినిపించి మమ అనిపించారు. ఈ సందర్భంగా డి. వనిపెంట సర్పంచ్ బాలీశ్వరరెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 32 మంది విద్యార్థులున్నారు. కేవలం ఒక ఉపాధ్యాయుడు మాత్రమే బోధిస్తున్నారని అదనంగా




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

మరో ఉపాధ్యాయున్ని ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టికి తీసుకవచ్చారు.కార్యక్రమంలో వైస్ఎంపిపిలు ఆశీర్వాదమ్మ,రఫి, మాంసాభివృద్ధి సంస్థ డైరెక్టర్ అజీం,సింగిల్ విండో అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి,తాహసీల్దార్ విజయ్‌కుమార్,ఎంఈఓ అనురాధ, ఇన్‌చార్జ్ సీడీపీఓ ఉమామహేశ్వరి,ఏఓ రంగనేతాజీ,వైద్యులు ఇమ్రాన్,ఏఈలు కొండారెడ్డి,జగ్గయ్య,నవీన్,పశువైద్యాధికారి సాయి బాబా,దీపా,ఈఓ తారకేశ్వరి,ఏపిఓ ప్రతాప్,వివిద శాఖల అధికారులు,సిబ్బంది,ఎంపీటీసీలు,సర్పంచ్‌లు,పంచాయతీ కార్యదర్సులు పాల్గొన్నారు.

# గ్యాస్ భద్రతపై మహిళలకు అవగాహన

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ ఎల్ ఈ. రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజలకు మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రామళ్లకోట గ్రామ ప్రజలతో మాట్లాడుతూ గ్యాస్ లీకై ఏదైనా వాసన వస్తుంటే ముందుగా గ్యాస్ రెగ్యులేటర్ ఆఫ్ చేసుకోవాలన్నారు. గ్యాస్ పెద్ద మొత్తంలో లీక్ అయితే వంటగది లో ఉన్న అన్ని విద్యుత్ స్విచ్ లను ఆఫ్ చేయాలన్నారు. గ్యాస్ వాసన




వచ్చినప్పుడు ఎలక్ట్రికల్ స్విచ్ లను తాకకూడదన్నారు. ఏదైనా స్విచ్ నుంచి స్పార్కు పడితే గ్యాస్ నుండి మంటలు వచ్చే అవకాశం ఉందన్నారు. సిలిండర్ కి మంటలు వస్తున్నట్లయితే ఏదైనా కాటన్ వస్తువు నీటిలో ముంచి సిలిండర్ కు చుట్టాలన్నారు. అది అగ్నిని ఆర్పి వేస్తుంది మీ ఇంట్లో అగ్నిమాపక పరికరాలు ఉంటే వాటిని ఉపయోగించుకోవచ్చన్నారు. రెగ్యులేటర్ గ్యాస్ పైపును కూడా గ్యాస్ లీకేజీ కి కారణం ఏర్పడుతుందన్నారు. ఎప్పటికప్పుడు రెగ్యులేటర్ గ్యాస్ పైప్ ను తనిఖీ చేయించుకోవాలన్నారు పైపు అరిగిపోయినట్లు అనిపిస్తే వెంటనే మార్చుకోవాలన్నారు.

# ముగిసిన మూడురోజుల బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా స్థాయి ఇన్‌స్పెక్షన్ కమిటీ (డిఎల్ఐసి) ఆద్వర్యంలో మూడురోజుల పాటు కొనసాగిన బాలల సంరక్షణ కేంద్రాల సమగ్ర తనిఖీ కార్యక్రమం గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ తనిఖీ కార్యక్రమం జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశాల మేరకు నిర్వహించబడింది. కమిటీ సభ్యులు ఈ మూడురోజులలో మొత్తం ఆరు బాలల సంరక్షణ సంస్థలను సందర్శించి సదుపాయాలు, రికార్డులు, పిల్లల సంక్షేమం వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దపాడు ప్రభుత్వ బాలికల గృహం, కర్నూలులోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం, సిక్యాంపులోని శిశు గృహం, గార్గేయపురం వద్దనున్న ఇన్‌సెంట్ జీసస్ హోమ్ ఫర్ బాయ్స్, పత్తికొండ ప్రభుత్వ బాలికల గృహం తదితర కేంద్రాలను కమిటీ సభ్యులు పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో సిబ్బంది పర్యవేక్షణలో పలు లోపాలు ఉన్నట్లు కమిటీ గుర్తించింది. జిల్లా స్థాయి ఇన్‌స్పెక్షన్ కమిటీ శారదా, సభ్యులు మధు సుధాకర్, మాధవి, రాయపాటి శ్రీనివాస్, డా. మంజూష, కె చంద్రశేఖర్, కేర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోండి

**-ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం ఆమె తన కార్యాలయంలో రోడ్డు సేఫ్టీ అధికారులు, నేషనల్ హైవే అధికారులు, రవాణా శాఖ అధికారులు, తహసిల్దార్, ఎంపీడీవో, ఆర్టీసీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ గత కొద్ది రోజుల నుండి రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. రహదారులపై ఎక్కడ కూడా గుంతలు లేకుండా మలుపుల వద్ద యూటర్న్ చిహ్నాలు, పాఠశాలల నిదానంగా వెళ్ళుము అన్న సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కువ ప్రమాదాలు జరగకుండా అధికారులు కృషి చేయాలని,తన దృష్టికి సమస్యలను తీసుకొని వస్తే పరిష్కరించడం జరుగుతుందని ఆమె అన్నారు.

# సతీష్ కుమార్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు?



సతీష్ కుమార్ రెడ్డి (ఫైల్ ఫోటో)

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** బనగానపల్లె గ్రామ పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బి. సతీష్ కుమార్ రెడ్డిపై సస్పెన్షన్‌వేటు పడినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. స్వర్ణగ్రామ పంచాయితీ పోర్టల్‌లో పట్టణంలోని ప్రతి ఇంటికి తిరిగి మొబైల్ నెం, ఆధార్ నెం, హౌస్ నెంబర్‌తో సర్వే చేయాల్సి ఉండగా సదరు గ్రామ పంచాయితీ పరిధిలో పూర్తిస్థాయిలో సర్వే పూర్తి కాకపోవడంతో పంచాయితీరాజ్ కమీషన్ కార్యాలయం నుండి సస్పెన్షన్ ఆర్డర్‌లు అందినట్లు తెలుస్తోంది. స్వర్ణ గ్రామ పంచాయితీ పోర్టల్‌లో డేటాను సేకరించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఈ మేరకు ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. అయితే ఈ విషయంపై బనగానపల్లె ఎంపిడిఒ నాగరాజును వివరణ కోరగా సతీష్ కుమార్ రెడ్డి సస్పెన్షన్‌కు సంబంధించిన ఎటువంటి ఉత్తర్వులు తమకు అందలేదని వారు తెలిపారు.

# గ్రామగ్రామాన బిజెపి పార్టీని బలోపేతం చేయాలి

**స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం**



**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచెర్ల మండలంలో గ్రామగ్రామాన బిజెపి పార్టీని బలోపేతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. గురువారం బేతంచెర్ల పట్టణంలో సౌత్ ఇండియా కార్యాలయంలో క్రియాశీలక నాయకులతో ,కార్యకర్తలతో జిల్లా కార్యదర్శి నాగ మోహన్ ఆధ్వర్యంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ భాగస్వామిలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. బిజెపి మండల నాయకులు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్వదేశీ వస్తు వినియోగం మన నినాదం కావాలని దేశ అభివృద్ధి స్వయం సవృద్ధి కోసం ఇతర దేశ ఉత్పత్తులపై ఆధారపడకుండా స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రజలతో,నాయకులతో,కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సమావేశంలో డోన్ నియోజకవర్గ కన్వీనర్ సందు రమణ,మండల అధ్యక్షుడు దాదాగాళ్ల ఆంజనేయులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎర్రమట్టి తరలింపుకు అనుమతులు తప్పనిసరి

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** మండలంలో అక్రమంగాఎర్రమట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నా సంగతి పత్రికలలో ప్రచురణ కావడంతో జిల్లా భూగర్భగనులశాఖ అధికారులు మండలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం మండల తహశీల్దార్‌తో కలిసి ఎర్రమట్టి తవ్వకాలు నిర్వహించిన స్థలాన్ని పరిశీలించారు.అనంతరం ఏడిఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో ఎర్రమట్టి కొండలు అక్రమార్కుల చేతిలో కనుమరుగవుతున్నాయి.మండలానికి మంచి వనరు,సంపదగా వున్న ఎర్రమట్టి కొండలను అక్రమంగా అనుమతులు లేకుండా తరలించడం నేరం.అందుకు భూగర్భగనులశాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని,అనుమతులు అతిక్రమించి అక్రమంగా ఎర్రమట్టి తరలించిన వారిపై చట్టపరమైన చర్యలకు శిక్షార్హులు.అదేవిదంగా ఆయా గ్రామాలలో ఎర్రమట్టి కొండలను కాపాడుకునే బాధ్యత ఆయా గ్రామాల వీఆర్వోలు మండల మెజిస్ట్రేట్ డే బాధ్యత అని భూగర్భ గనులశాఖ ఏడిఏ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా మండల తాశీల్దార్ వెంకటలక్ష్మి,ఏడిఏ వెంకటేశ్వర్లు,ఏజీ రాజశేఖర్,టిఏ దిలీప్ కుమార్ అదేవిధంగా గ్రామ విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



UGC NET
APPSC/ TSPSC DL,JL
Exams Special

# తెలుగు మాండలిక విజ్ఞానం

## సాధన ప్రశ్నలు

(గత వారం తరువాయి...)

**36. వచ్చిండు, తెచ్చిండు, ఇచ్చిండు వంటి పదాలు కనబడే మాండలికం ఏది?**
1) పూర్వమండలం 2) మధ్య మండలం
3) ఉత్తర మండలం 4) దక్షిణ మండలం

**37. 'పకాలి' (గంజి అన్నం) అనే పదం ఈ మాండలిక పదం**
1)పూర్వమండలం 2) మధ్య మండలం
3) ఉత్తర మండలం 4) దక్షిణ మండలం

**38. ఒకే భాషలో గల ప్రజల వ్యవహారాల్లో వ్యత్యాసాలను ఇలా అంటారు?**
1) మాండలికం 2) అర్థ విపరిణామం
3) ధ్వని విపరిణామం 4) లోక వ్యవహారం

**39. ఎక్కువమంది ప్రజలకు సమ్మతంగా ఉండి ప్రత్యేకమైన భాషోచ్చారణకు గల పేరు**
1) ప్రామాణిక భాష
2) మాండలిక భాష
3) న్యూన ప్రామాణిక భాష
4) వర్గ మాండలిక భాష

**40. క్రిందివాటిలో సత్యప్రవచనంను గుర్తించండి.**
1) మధ్యాంధ్ర మండలాన్ని మిశ్రవ్యవహార మండలమని అంటారు.
2) ప్రతీమాట వాడుకలోనూ మిగిలిన మూడు మండలాల్లో ఏదో ఒకదానితో కలవడం మధ్యాంధ్ర మాండలికం విలక్షణత.
3) డైలెక్ట్ అనే ఆంగ్ల పదానికి సమానార్థక తెలుగుపదం మాండలికం.
4) పైవన్నీ సరైనవే

**41. క్రిందివాటిలో సత్యప్రవచనాన్ని గుర్తించండి**
1) మాండలిక కోశ నిర్మాత మరుపూరి కోదండరామిరెడ్డి.
2) మరుపూరి కోదండరామిరెడ్డి మాండలిక పరిశోధక జ్ఞాని.
3) జనం ప్రధానంగా వృత్తిపై ఆధారపడతారు కనుక వృత్తిమాండలికాలు ప్రసిద్ధి చెందాయి.
4) పైవన్నీ సరైనవే

**42. క్రిందివాటిలో సత్యప్రవచనంను గుర్తించండి**
1) విద్యాభివృద్ధి మాండలిక భేదాలను తగ్గిస్తుంది
2) విద్యాద్వారా ప్రామాణిక భాషావ్యాప్తి పెరుగుతుంది కనుక
3) 1, 2 రెండూ సరైనవే
4) 1, 2 రెండూ సరైనవి కావు

**43. క్రిందివాటిలో సత్యప్రవచనంను గుర్తించండి**
1) వృత్తి పదకోశాలు తెలుగుకు మాత్రమే పరిమితం
2) ఇవి తెలుగులో మాత్రమే ఉన్నాయి కాబట్టి
3) 'గునాదరం' అనునది రాయలసీమ మాండలిక పదం
4) తెలుగు మాండలిక పరిశోధనలో ఆద్యుడు తూమాటి దొణప్ప

**44. క్రిందివాటిలో అసత్యప్రవచనంను గుర్తించండి**
1) ప్రతీ భాషలోనూ కుల మాండలికాలు ఉండడం మాండలికాల లక్షణం
2) రాయలసీమ, కోస్తా మాండలికాల్లో పరస్పరం ఆదాన ప్రదానాలు కనిపిస్తాయి
3) ఎందుకంటే ఈ రెండు ప్రాంతాల మధ్య భౌగోళిక సంబంధం ఉంది కనుక
4) ఒక భాషలోని పదజాలం ఆ భాష మాట్లాడే వాళ్ళ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది

**45. భద్రిరాజు కృష్ణమూర్తి గారి సంపాదకత్వంలో వచ్చిన మాండలిక వృత్తి పదకోశాలు**
1) చేనేత వృత్తి పదకోశం
2) వ్యవసాయ వృత్తి పదకోశం
3) 1 , 2 4) 2 మాత్రమే

**46. చెప్పులను ఏ మాండలికంలో 'మెట్లు' అంటారు?**




1) పూర్వమండలం 2) మధ్య మండలం
3) ఉత్తర మండలం 4) దక్షిణ మండలం

**47. క్రిందివాటిలో ఏది భిన్నమైనది?**
1) మదుం 2) పూడిసిండు
3) భోగట్టా 4) నక్కు

**48. క్రిందివాటిలో సరైన అంశాన్ని గుర్తించండి**
1) మాండలికాల సరిహద్దులను గుర్తించడానికి 'మాండలిక పటాలు' ఉపయోగపడతాయి
2) ధ్వనులను ప్రధానంగా చేసుకొని గీచిన పటాలను 'ఫొనెటిక్ అట్లాసు' అంటారు
3) మాండలిక పటాలలో ప్రధానంగా కనిపించేవి 'వ్యవహార విభజన రేఖలు'.
4) పైవన్నీ సరైనవే

**49. 'మండలం' అనేది ఏ భాషాపదం?**
1) కన్నడ 2) ఉర్దూ
3) సంస్కృతం 4) మరాఠీ

**50. క్రిందివాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి**
1) మండలము అనగా అర్థం 'దేశ భాగము'
2) ఒక జాతి ప్రజలను కానీ, సంఘాన్ని కానీ మండలం అంటారు
3) జిల్లా, రాశి, సమూహం, గుంపు అనేవి మండలానికి పర్యాయ పదాలు
4) పైవన్నీ సరైనవే

**51. మాండలికాన్ని 'మాండలిక భాష' అని వ్యవహరించినవారు ఎవరు?**
1) భద్రిరాజు కృష్ణమూర్తి
2) వేదం వేంకటరాయ శాస్త్రి
3) లంకసాని చక్రధరరావు
4) చిలుకూరి నారాయణరావు

**52. మాండలిక భాష కు పర్యాయ పదాలను గుర్తించండి**
1) ఉపభాష 2) ప్రాదేశిక భాష
3) ప్రాంతీయ భాష 4) 1, 2 , 3

**53. మాండలికాల వల్ల ప్రయోజనాలేవి?**
1) మాండలికాలు భాషకు సజీవ చిహ్నాలు.
2) భాషా స్వరూపాన్నీ, భాషా చరిత్రనూ మాండలికాలు వల్ల తెలుసుకోవచ్చు
3) మాండలికాలు భాషకు సౌందర్యాన్ని, వైవిధ్యాన్ని పెంపొందిస్తాయి
4) పైవన్నీ సరైనవే

**54. ప్రజల మధ్య వ్యవహార ప్రాభల్యం సన్నగిల్లడం వల్ల ఏర్పడే మాండలికాలు**
1) సామాజిక మాండలికాలు
2) చారిత్రక మాండలికాలు
3) ప్రాంతీయ మాండలికాలు
4) జీవశాస్త్రానుసార మాండలికాలు

**55. ఈ మాండలికాలను 'స్థల మాండలికాలు' అంటారు**
1) సామాజిక మాండలికాలు
2) ప్రాంతీయ మాండలికాలు
3) చారిత్రక మాండలికాలు
4) జీవశాస్త్రీయ మండలికాలు

**56. వ్యక్తులు పుట్టి పెరిగిన ప్రాంతాల ఆధారంగా ఏర్పడిన మాండలికాలు**
1) సామాజిక మాండలికాలు
2) ప్రాంతీయ మాండలికాలు
3) చారిత్రక మాండలికాలు
4) జీవశాస్త్రీయ మాండలికాలు

**57. వర్గ మాండలికం, కుల/వర్ణ మాండలికం, వైయుక్తిక మాండలికం అనేవి ఈ మాండలికం పరిధిలోకి వస్తాయి**
1) సామాజిక మాండలికాలు
2) ప్రాంతీయ మాండలికాలు
3) చారిత్రక మాండలికాలు
4) జీవశాస్త్రీయ మాండలికాలు

**58. క్రిందివాటిలో సత్యప్రవచనంను గుర్తించండి**
1) భారతదేశంలో మాత్రమే కులమాండలికాలు ఉన్నాయి.
2) ప్రపంచంలో ఏ ఇతర భాషలో కూడా కులమాండలికాలు లేవు
3) 1,2 రెండూ సరైనవే
4) రెండూ సరికావు

**59. 'త్రాసు' పదం ఇక్కడ కనిపిస్తుంది**
1) నన్నయ భారతంలో
2) తిక్కన భారతంలో
3) ఎఱ్ఱన భారతంలో
4) మారన మార్కండేయ పురాణం

**60. త్రాసు పదానికి మరోరూపం 'తరాజు'. ఈ తరాజు పదం ఈ మండలంలో కనిపిస్తుంది**
1) ఉత్తర మండలంలో
2) పూర్వ మండలంలో
3) దక్షిణ మండలంలో
4) మధ్య మండలంలో

**జవాబులు**

36)3 37)1 38)1 39)1 40)4
41)4 42)3 43)3 44)1 45)3
46)4 47)2 48)4 49)3 50)4
51)2 52)4
53)4 54)3
55)2 56)2
57)1 58)3
59)2 60)2



నుమన్ సేపాన, M.A,B.Ed
విషయ నిపుణులు
శ్రీకాకుళం జిల్లా

## ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైంటేబుల్ -2026

ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి, సెకండ్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు లాంగ్వేజ్ పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రారంభమై 10వ తేదీతో ముగుస్తాయి.

**ఏపీ ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షల షెడ్యూల్ 2026**

ఫిబ్రవరి 23న లాంగ్వేజ్ పేపర్ 1
ఫిబ్రవరి 25న ఇంగ్లీష్ పేపర్ 1
ఫిబ్రవరి 27న హిస్టరీ పేపర్ 1
మార్చి 2న మ్యాథ్స్ పేపర్ 1
మార్చి 5న బయాలజి పేపర్ 1
మార్చి 7న ఎకనామిక్స్ పేపర్ 1
మార్చి 10న ఫిజిక్స్ పేపర్ 1
మార్చి 12న కామర్స్ పేపర్ 1



మార్చి 14న సివిక్స్ పేపర్ 1
మార్చి 17న కెమిస్ట్రీ పేపర్ 1
మార్చి 20న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ / లాజిక్ 1 పరీక్ష
మార్చి 24న మోడ్రన్ లాంగ్వేజ్ / జియోగ్రఫీ 1

**ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షల షెడ్యూల్ 2026**

ఫిబ్రవరి 24న లాంగ్వేజ్ పేపర్ 2
ఫిబ్రవరి 26న ఇంగ్లీష్ పేపర్ 2
ఫిబ్రవరి 28న హిస్టరీ / బోటనీ పేపర్ 2
మార్చి 3న మ్యాథ్స్ పేపర్ 2 ఎ / సివిక్స్ 2
మార్చి 6న జువాలజి 2 / ఎకనామిక్స్ 2
మార్చి 9న మ్యాథ్స్ పేపర్ 2 బి
మార్చి 11న ఫిజిక్స్ / కామర్స్ / సోషియాలజీ / మ్యూజిక్ 2
మార్చి 13న ఫిజిక్స్ 2
మార్చి 16న మోడ్రన్ లాంగ్వేజ్ / జియోగ్రఫీ 2
మార్చి 18న కెమిస్ట్రీ 2
మార్చి 23న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ / లాజిక్ 2

# స్వదేశీ వస్తువుల వాడకంపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బిజేపి నాయకులు

**బనగానపల్లెమేజర్,న్యూస్‌ః** స్వదేశీ వస్తువుల వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని బనగానపల్లె పట్టణంలోని కంకర గుర్రెడ్డి కళాశాలలో బిజేపి పట్టణ అధ్యక్షులు యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్ పాల్గొని విద్యార్థులకు స్వదేశీ వస్తువుల వాడకంపై అవగాహన కల్పించి విదేశీ వస్తువుల కొనుగోలును చేయడం వాడటం వల్ల దేశానికి జరుగుతున్న నష్టాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను వాడి చుట్టుప్రక్కల వారిని కూడా స్వదేశీ ఉద్యమంలో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజేపి జిల్లా నాయకులు శరత్‌చంద్ర కుమార్, తిరుమలయ్య, సుదీర్, కళాశాల సిబ్బంది నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలను తనిఖీ చేసిన మండల ప్రత్యేక అధికారి, ఎంపిడిఓ



**పాములపాడు,మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఎస్సీ హాస్టల్, ఏపీ మోడల్ స్కూల్‌లను గురువారం మండల ప్రత్యేక అధికారి రాజు,ఎంపీడీవో చంద్రశేఖర్ సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల హాజరు, బోధన విధానం, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని, విద్యార్థుల అభ్యాసం పట్ల మరింత ఆసక్తి చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులు నెట్ సరిగా లేకపోవడం, దోమల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఎస్ఓ రాజ్యలక్ష్మి, బాలికల వసతిగృహం హెచ్‌డబ్ల్యూ ఓ అనిత, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నాగ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# భారత హాకీ చరిత్ర- ధ్యాన్ చంద్ జీవితం" పై వక్తృత్వ పోటీలు



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** భారత హాకీ శతాబ్ది ఉత్సవాలు పురస్కరించుకొని నంద్యాల హాకీ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల లయన్స్ క్లబ్ సహకారంతో గురువారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో "భారత హాకీ చరిత్ర – ధ్యాన్ చంద్ జీవితం" అంశంపై ఆంగ్లంలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఆంగ్ల ప్రొఫెసర్ ఐ. విజయభాస్కర రెడ్డి, డాక్టర్ రవి కృష్ణ వ్యవహరించారు. ఈ సందర్భంగా హాకీ ఆంధ్రప్రదేశ్ సంఘం అధ్యక్షులు చాణక్య రాజు,ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఒలింపిక్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల హాకీ సంఘం ఆధ్వర్యంలో ఏడవ తేదీ ఎస్పీజీ మైదానంలో ఉదయం జరిగే హాకీ శతాబ్ది ఉత్సవాలలో వ్యాసరచన,వక్తృత్వ పోటీల బహుమతులు అందజేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని 1000 హాకీ మ్యాచులు హాకీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని,నంద్యాలలో కూడా హాకీ మ్యాచ్ నిర్వహిస్తున్నామన్నారు. హాకీ క్రీడాకారులను సత్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్,నంద్యాల హాకీ సంఘం ఉపాధ్యక్షులు స్టీఫెన్, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి పత్తి రంగనాథ్ పాల్గొన్నారు. వక్తృత్వ పోటీ విజేతలు గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన అల్ సుమయ,ముస్కాన్ జవేరియా,మేఘన ప్రథమ,ద్వితీయ, తృతీ యస్థానాలుసాధించగా,జయ ప్రకాష్ రాజ్, ఆఫ్రిన్ స్పెషల్ జ్యూరీ బహుమతులకు ఎంపికయ్యారు.

# గ్యాస్ లీకై జరిగిన పేలుడులో ఇల్లు ధ్వంసం

**ఆదుకోవాలని బాధితుల ఆవేదన**

**బీరువాలోని దుస్తులు తదితరాలు కాలిబూడిదైన వైనం**


ఘటనలో పూర్తిగా ధ్వంసమైన ఇంటి సామాగ్రి

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌ః** మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో గురువారం ఉదయం 10ః00 గంటల సమయంలో గ్రామానికి చెందిన బెస్తగంటే రామాంజినేయులు ఇంటిలో గ్యాస్ లీకై ఇళ్ళు మొత్తం ధ్వంసమైన ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మంటలు వ్యాపించి ఇంటిలోని వస్తువులన్నీ కాలిబూడిదైయ్యాయి. మరిన్ని వివరాలలోకి వెళితే బాధితుడి తల్లి మద్దమ్మ, భార్య లక్ష్మిపార్వతి, ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. బాధితుడు తెలంగాణ రాష్ట్రంలోని మామిడి తోటలను గుత్తకు తీసుకొని పండ్ల వ్యాపార నిమిత్తం బాధితుడు వెళ్ళాడు. బాధితుడి తల్లి, భార్య ఇంట్లో వంట పూర్తి చేసుకొని పిల్లలకు టిఫిన్ పెట్టి కూలి పనికి వెళ్ళారు. పిల్లలు ఇంటికి తాళం వేసి గ్రామంలోనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వెళ్ళారు. ఉదయం 10ః00 గంటల సమయంలో ఇంట్లో భారీ పేలుడు శబ్దం సంభవించడంతో చుట్టుపక్కల వారు సైతం భయాందోళనకు గురైయ్యారు. ఇంటి ఆరుబయట ఉంచిన ద్విచక్ర వాహనానికి సైతం మంటలు వ్యాపించాయి. అనంతరం స్థానికులు మంటలను అదుపు చేస్తూ ఇంటిలోని సామాన్లను బయటకు తీసే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో ఇంటిలోని బీరువా, అందులో ఉన్న 9 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలు వేడికి కరిగిపోయి ముద్దలుగా పడిఉన్నాయి. అలాగే నిత్యవసర సరుకులు, వంట సామాగ్రి, బీరువాలోని మొత్తం దుస్తులు, విలువైన పత్రాలు, రూ.97వేల నగదు కాలిపోయి, ఫ్రిజ్, టీవి ధ్వంసమైయ్యాయి. ఈ ఘటనతో దాదాపు రూ.20లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు రామాంజినేయులు వాపోయాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామప్రజలు కోరారు.

# కల్లుబావిలో స్మశాన వాటికకు రక్షణ గోడ నిర్మించాలి

**– సమస్య పరిష్కారం కొరకు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా**

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని పట్టణసమస్యలను పరిష్కరించాలని, ఆదోని సమగ్రాభివృద్ధి కొరకు ఈనెల 10న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు, పట్టణ కార్యదర్శి లక్ష్మన్నలు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ, ప్రధానంగా కల్లుబావి స్మశాన వాటికకు కల్లుబావి, శంకర్ నగర్, ప్రకాష్ నగర్, భాస్కర్‌రెడ్డి కాలనీ, వైఎస్సార్ కాలనీ, భీమ్‌రెడ్డికాలనీ ప్రజలకు ఇది ఒకటే స్మశాన వాటికకు రక్షణ గోడ లేకపోవడంతో రాత్రి వేళలో కుక్కలు, పందులు స్మశానంలో ఉన్న శవాలను బయటకు తీసుకొచ్చి చుట్టుప్రక్కల ఉన్న ఇళ్ల మధ్యలో వదిలేసి వెళ్లడం జరుగుతున్నాయన్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతూ, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ప్రాంతంలో మంచి నీటి సమస్య పరిష్కారం కొరకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయలని వారు కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, ముక్కన్న, తిప్పన్న, నాయకులు నాగరాజు, కృష్ణమూర్తి, మల్లయ్య, మనోహార్,కాలనీ ప్రజలు, పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా వాహనాల ముమ్మర తనిఖీలు

**– 629 మందిపై కేసులు నమోదు – రూ.2.03లక్షల జరిమాన**


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా మోటార్ వాహనాల చట్టాన్ని అమలు చేయాలని జిల్లా వ్యాప్తంగా వాహనాల ముమ్మర తనిఖీలు చేసి 629 మందిపై కేసులు నమోదు చేసి రూ. 2,03,290 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు. సరైన ధృవపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, డ్రంగ్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, మైనర్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, త్రిబుల్ రైడింగ్, తదితర నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబందనలపై ప్రజలకు పోలీస్ అధికారులు అవగాహన కల్పించారు. రోడ్డు దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మహిళలు బైక్‌పై ప్రయాణించే సమయంలో తమ దుస్తులు వాహనాల్లో చుట్టుకోకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడంలో ప్రజల భాగస్వాములు కావాలని సూచించారు.

# పార్వతీపురం ఏఎస్‌పీగా మహానంది మండల అమ్మాయి


ఏఎస్పీగా బాధ్యతలు తీసుకున్న మనిషారెడ్డి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలం నందిపల్లె గ్రామానికి చెందిన వంగాల మనిషారెడ్డి మణ్యం జిల్లా పార్వతీపురం ఏఎస్‌పీగా బాధ్యతలు తీసుకున్నట్లు ఆమె తండ్రి సర్వేశ్వరరెడ్డి తెలిపారు. ఇటీవల శిక్షణను పూర్తి చేసుకున్న ఆమె ఆ జిల్లా ఎస్పీ నుంచి బాధ్యతలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మహానంది మండలం నుంచి మొదటి ఐపీఎస్ మహిళగా ఆమె మండలంలో గుర్తింపు పొందారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా ప్రజా ఉద్యమం


కోటిసంతకాల సేకరణ చేస్తున్న వైఎస్సార్ నాయకులు

**ఆదోని, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని చట్నేహళ్ళి గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ, వైఎస్సార్సిపి మండల అధ్యక్షులు భీమారెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆంజి, ఎంపిటిసీ రామాంజనేయులు, ఉప సర్పంచ్ వీరనాగుడు, మాజీ సర్పంచ్ ఆలింగప్ప, నాగేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్ తో బాలుడు మృతి


మృతి చెందిన సోమ శేఖర్

**హాలహర్వి, మేజర్ న్యూస్ :** హాలహర్వి మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన భీమా,శాంతమ్మ దంపతుల కుమారుడు సోమశేఖర్ కొళాయి మోటార్ పక్కకు పెట్టడానికి వెళ్లి కరెంట్ షాక్ కొట్టడంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెలితే సిద్ధాపురం గ్రామానికి చెందిన బీమా,శాంతమ్మ లకు ఇద్దరు కూతుర్లు,ఒక కొడుకు సంతానం. కొడుకు సోమశేఖర్ గూళ్యం గ్రామంలో 7 వతరగతి చదువుతుండగా బాలుడిని నానమ్మతో వదిలి కుటుంబం బతుకు తెరువుకోసం తెలంగాణకు బయలుదేరారు. అయితే గురువారం కొళాయి మోటార్ స్విచ్ ఆన్ చేసి మోటార్ ను పట్టుకోవడంతో కరెంట్ షాక్ తగిలి స్పృహతప్పి పడిపోయాడు. బాలుడిని బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హాలహర్వి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తామన్నారు.

# అవుకు ఎంపిడిఒగా రామకృష్ణవేణి బాధ్యతలు స్వీకారం


రామకృష్ణవేణి

**అవుకుమేజర్,న్యూస్‌ః** అవుకు ఎంపిడిఒగా రామకృష్ణవేణి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈమె బండిఆత్మకూరు డిప్యూటీ ఎంపిడిఒగా పని చేస్తుండగా ప్రమోషన్ రావడంతో ఆమెను ఉన్నతాధికారులు అవుకు మండలానికి ఎంపిడిఒగా నియమించారు. ఆమె గతంలో అవుకులో కూడా డిప్యూటీ ఎంపిడిఒగా పదవీ బాధ్యతలను నిర్వహించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలను అధికారుల సహకారంతో , ప్రజా ప్రతినిధుల సహకారంతో ఎప్పటికప్పుడు నెరవేర్చగలనని అన్నారు.

# అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు- ఎస్.ఐ

**మంత్రాలయం, మేజర్ న్యూస్:** మట్కా, గ్యాంబ్లింగ్, ఇతర అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని మాధవరం ఎస్.ఐ విజయ కుమార్ పేర్కొన్నారు. మంత్రాలయం మండల పరిధిలోని మాధవరంలో ఆయన మాట్లాడుతూ, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూస్తామన్నారు.

సూర్య
శుక్రవారం | 07 నవంబరు 2025

# మూగజీవాలకు గ్రాసంగా ఉల్లి పంట

**-రైతుల పంట మూగజీవాలకు మేతగా -కౌలు రైతుకు పెద్ద సుంకన్నకు రూ. 3లక్షల నష్టం**



గోనెగండ్లలో ఉల్లిపంటను మూగజీవాలకు మేతగా వదిలిన దృశ్యం

**గోనెగండ్ల,మేజర్‌న్యూస్ :** ఉల్లి పంటకు గిట్టు బాటు ధర లభించక పోవడంతో ఉల్లి రైతులు పండించిన పంటను గ్రాసంగా మూగజీవాలకు వదులుతున్నారు. మరి కొందరు ఉల్లి పంటను పొలంలోనే వదిలివేస్తున్నారు. గోనెగండ్లకు చెందిన పెద సుంకన్న అనే రైతు మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని ఉల్లి పంటను సాగు చేశాడు. అయితే పంటకు గిట్టుబాటు ధర లేక పోవడం తో గురువారం మూగజీవాలకు గ్రాసంగా వదిలారు. తాను మూడెకరాలు కౌలుకు తీసుకొని రూ.3 లక్షలుపెట్టు బడి పెట్టినట్లు రైతు పెద్ద సుంకన్న తెలిపారు. క్వింటం ఉల్లి ధర రూ.600 నుంచి రూ.890 లోపు ఉండటంతో చేసేది లేక గ్రాసంగా వదిలివేశారు. మండల కేంద్రమైన గోనెగండ్ల కు చెందిన 10 మంది ఉల్లి రైతులు దాదాపు 20 ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంటను మూగజీవాలకు గ్రాసం వదిలివేశారు. ఒక్కొక్క ఎకరంకు రూ.70 నుంచి రూ.90వేల వరకు పెట్టబడి పెట్టారు. అయితే తీర పంటచేతికి అందిన సమయానికి క్వింటం ధర రూ.600 నుంచి రూ.890 లోపు పలుకుతుండటంతో పంటను కోసిన కూలీలు కూడా గిట్టుబాటు కాదని తలచి మర్కెట్ తీసుకువెళితే రవాణా ఖర్చులు కూడా చేతి నుంచే పడతాయని రైతు భయపడి ఇక చేసేది లేక తాము పండించిన ఉల్లిని మూగజీవాలకు గ్రాసంగా వదిలారు. ఉల్లి రైతుల కష్టాలు అన్ని ఇన్ని కావు. మండలంలో దాదాపు ఇప్పటికి 200 ఎకరాలు లలో సాగు చేసిన ఉల్లిని మూగజీవాలకు మేతగా వదలడం, ట్రాక్టర్తో పంటను దున్నివేయడ జరిగిందని రైతులు తెలుపుతున్నారు. మరికొన్ని పొలాల్లో గ్రామస్థులు ఉచితంగా ఉల్లిని కోసుకొని తీసుకువెలుతున్నారు.

## ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠినచర్యలు-ఎస్సై ఎం.నరేష్

**వెల్దుర్తి,వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** పట్టణంలోని ఆటోడ్రైవర్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని వెల్దుర్తి ఎస్సై ఎం.నరేష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణం నందు గురువారం చిన్న ఆటోడ్రైవర్లకు ఎస్సై ఎం.నరేష్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎం.నరేష్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, పట్టణంలో శాంతిభద్రతలను కాపాడేందుకు అందరూ సహాయసహకారాలు అందించాలన్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో చిన్న ఆటోలు ప్రధాన రహదారులపై తిరగకుండా, సంత మార్కెట్,పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఆటోస్టాండ్ నుండే ప్రయాణాలు కొనసాగించాలన్నారు. అదేవిధంగా ఆటోలలో ఓవర్ లోడింగ్ వేయకుండా, నిర్ణీత పరిమితితోనే ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా ఆటోడ్రైవర్లు చేర్చాలన్నారు. కావున ట్రాఫిక్ నిబందనలు, రోడ్డు భద్రత నియమాలను పాటించకుండా ఇష్టానుసారంగా ఆటోలను నడిపితే శాఖపరమైన చర్యలతో పాటు, కేసులు నమోదు చేసి, డ్రైవింగ్ లైసెన్స్, ఆటోను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై ఎం.నరేష్

# రేషనలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయండి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఈఆర్వో, ఎఈఆర్వోలకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆమె ఈఆర్వోలు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో రేషనలైజేషన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియలో ప్రతిపాదించిన కేంద్రాలను స్వయంగా పరిశీలించి నిబంధనల ప్రకారం ధృవీకరించి ప్రతిపాదనలు సమర్పించాలని ఈఆర్వో, ఎఈఆర్వోలను ఆదేశించారు. సదరు ప్రతిపాదనలను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో పునఃపరిశీలన అనంతరం ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ప్రతి ఈఆర్వో, ఎఈఆర్వో తమ పరిధిలోని పోలింగ్



సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

కేంద్రాలను ప్రత్యక్షంగా సందర్శిం చి సంబంధిత స్కెచ్‌లు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1629 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో ఐదు కేంద్రాల పేర్లను (శ్రీశైలం-4, బనగానపల్లె-1) మార్చడం జరిగిందని పేర్కొన్నారు. 36 పోలింగ్ కేంద్రాల మార్పు కు ప్రతిపాదనలు అందాయని వీటిలో ఆళ్ళగడ్డ 9, శ్రీశైలం 6, నంద్యాల 13, బనగానపల్లె 1, డోన్ 7 కేంద్రాలు ఉన్నాయని వివరించారు. 113 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందాయని వీటిలో ఆళ్ళగడ్డ 13, శ్రీశైలం 8 నంద్యాల 48,బనగానపల్లె29, డోన్5, నందికొట్కూరు 10 కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. కొత్త కేంద్రాలు ఏర్పాటయ్యాక జిల్లాలో మొత్తం 1742పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయని వివరించా రు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు సమయంలో ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు కేంద్రంలో ఉండకుండా అందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ ఆళ్ళగడ్డలో ఉన్న ఒక పోలింగ్ కేంద్రం స్థానిక శాసనసభ్యు ని ఇంటి సమీపంలో ఉందని దానిని మార్పు చేయాలని కోరారు. పాండురంగాపురం, బాపూజీ నగర్ ప్రాంతంలో సుమారు 1200మంది ఓటర్లు ఉన్నందున అక్కడ ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ఈసమావేశంలో డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, నరసింహులు, శివనాగజ్యోతి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డ సబ్ -రిజిష్టర్ కార్యాలయంలో కొనసాగుతున్న ఏసీబీ సోదాలు

**అవినీతి అధికారుల భరతం పడతాం అంటున్న ఏసీబీ డీఎస్పీ సోమన్న**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రెండవ రోజు గురువారం కూడా వరుసగా అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు చేస్తున్నారు. సోదాలు చేసే కొద్దీ అవినీతి జరిగినట్లు బయటకు వస్తుండడంతో సోదాలు మరిన్ని రోజులు కొనసాగేలా ఉన్నాయి. ఈ సందర్భంగా గురువారం ఏసీబీ డిఎస్పి సోమన్న విలేకరులతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో సోదాలు మరిన్ని రోజులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. చుక్కల భూములు, ప్రభుత్వ భూములు సైతం



సోదాలు నిర్వహిస్తున్న దృశ్యం

తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు తమ తనిఖీల్లో గుర్తించామన్నారు. రూ.100విలువైననాన్‌జ్యుడీషియల్ స్టాంపులు 103 రికార్డులలో పొందుపరచ నట్లుగా తాము గుర్తించడం జరిగిందన్నారు. అలాగే సీనియర్ అసిస్టెంట్ డాక్యు మెంట్ రైటర్ల



మాట్లాడుతున్న ఏసీబీ డిఎస్పీ సోమన్న

ద్వారా గూగుల్ పే ద్వారా కొంత మొత్తాన్ని చేయించుకున్నట్లు వెలుగు చూడడం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరింత లోతుగా వెళ్లి దర్యాప్తు చేపడతామని అవినీతి అధికారుల భరతం పడతామని డీఎస్పీ సోమన్న వివరించారు.

# భిక్షాటన నిషేధం సరైంది కాదు

**★ గౌరవప్రద జీవితం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత**

**– కలెక్టరేట్ ముందు బుడగజంగాల ధర్నా**

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం భిక్షాటన నిషేధించడాన్ని నిరసిస్తూ గురువారం కలెక్టరేట్ ముందు ఆంధ్రప్రదేశ్ బేడ, బుడగ జంగం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుడగ జంగాలు ధర్నా నిర్వహించారు. సరైన ఉపాధి లేక బిక్షాటనకు వెళుతున్నారని, గౌరవప్రదమైన జీవితాన్ని ఇవ్వాల్సిన ప్రభుత్వం అలా చేయకుండా భిక్షాటన నిషేధించడమేమిటని సంఘం అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ ప్రశ్నించారు. భిక్షాటన చేస్తోంది



బిక్షాటన చేస్తున్న బుడగజంగాల నాయకులు

సోమరితనంతో కాదని, జీవనం సాగించేందుకు అవసరమైన ఉపాధి దొరక్క అని ఆయన చెప్పారు. పూర్వం నాటి జీవన విధానం మారిపోయిందని, ఆనాడు కొన్ని కులాలు గ్రామాల్లో తిరిగి పాటలు, కథలు చెప్పి జీవనం సాగించేవని, టెక్నాలజీ పెరిగిన తర్వాత సినిమా థియేటర్లు, టీవీలు అందుబాటులోకి వచ్చి పాత తరం సంస్కృతి కనిపించకుండా పోయిందని ఆయన గుర్తు చేశారు. దీంతోనే జీవనోపాధి పోయి తప్పనిసరి పరిస్థితుల్లో భిక్షాటన చేస్తున్నారని ఆయన చెప్పారు. ఇప్పుడు దాన్ని ఆపితే బతికే దారి దొరక్క ఇబ్బంది పడతారని ఆయన చెప్పారు. ప్రభుత్వం భిక్షాటన ఆపేందుకు ప్రయత్నించకుండా ఆయా కులాలకు ఉపాధి చూపించే అవకాశాలను సృష్టించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి చూపిస్తే వారు భిక్షాటన వదిలి వేస్తారని గుర్తించాలని ఆయన చెప్పారు.

# జల్‌జీవన్ మిషన్‌తో త్రాగునీటికి శాశ్వత పరిష్కారం ఎమ్మెల్యే బుడ్డా

**– జమ్మినగర్‌లో రూ. 7.2 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**– ఇంటింటికి కుళాయి కనెక్షన్ల ద్వారా రక్షిత నీటి సరఫరా**

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** శ్రీశైల నియోజకవర్గ ప్రజలు ఇకపై త్రాగునీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా చేయాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ కార్యక్రమ అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం వెలుగోడు పట్టణంలోని జమ్మినగర్‌లో రూ. 7.2 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశుభ్రమైన తాగునీరు ప్రతి ఇంటికి అందేవరకు జల్‌జీవన్ మిషన్ నిరంతరం అమలు చేస్తామని తెలిపారు. ప్రజలు ఎక్కడా నీటి కొరతకు గురి కాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌బాబులు ప్రత్యేక శ్రద్ధతో పథకాన్ని పర్యవేక్షిస్తున్నారని అన్నారు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణా వరకు సురక్షితమైన త్రాగునీటిని అందించే లక్ష్యంగా నీటి నిల్వ ట్యాంక్‌లు, అండర్ గ్రౌండ్ పైపులైన్లు, ఫిల్టరేషన్ సిస్టమ్స్, కుళాయి కనెక్షన్ల ఏర్పాటు చేపడుతున్నామని తెలిపారు. దీని ద్వారా భవిష్యత్తులో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో పంటలకు నష్టం జరిగిన రైతులకు పూర్తి సహాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇప్పటికీ తమ వివరాలు నమోదు చేయించుకోని నష్టపోయిన రైతులు వెంటనే సంబంధిత వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం అధనంగా రెండు రోజులు గడువు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచడంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ఏఈ జయ్‌పాల్, కూటమి నాయకులు మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, వెలుగోడు సింగిల్ విండో చైర్మన్ శంకర్‌రెడ్డి, ఖలీలుల్లాఖాన్, మెడికల్ రాము, డాక్టర్ జాకీర్ హుసేన్, షాలూబాష, మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద అధికారులు, పార్టీ నాయకులు